క్లుప్తంగా

పనులు పూర్తి చేయాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాకు సంబంధించి పర్సనల్ విభాగ పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని ఏరియా డీజీఎం(పర్సనల్) రమేష్ సంబంధిత అధికారులకు, ఉద్యోగులకు సూచించారు. సోమవారం జీఎం కార్యాలయ పర్సనల్ విభాగంలో ఆయన సంక్షేమ అధికారులు, మినిస్టీరియల్ స్టాఫ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక సంబంధాలు, ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. టెర్మినల్ బెనిఫిట్స్ విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీనియర్ పీఓలు ఎస్ శ్రీనివాస్, రామేశ్వరరావు, మదార్ సాహెబ్, అవినాష్, ఆఫీస్ సూపరింటెండెంట్లు వీరభద్రం, సుబాని, మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

మణుగూరురూరల్: పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘ భవనంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి, మండల అధ్యక్షుడు డాక్టర్ దుస్సా సమ్మయ్య మాట్లాడుతూ.. ఐక్యతతో చేనేత రంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాస్, మహేశ్వరపు రమేష్, రుద్ర నాగరాజు, కొలిపాక ప్రభాకర్, తాడి సత్యనారాయణ, వెంకట్రావు, టి.లక్ష్మీనారాయణ, పసునూటి రమేష్, చాడ శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల తహసీల్దార్‌గా జి.శిరీష సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ సమస్యలపై నేరుగా తనను సంప్రదించవచ్చని సూచించారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను డీటీ మణిధర్, ఆర్‌ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

గ్రామీణ వైద్యులతో సమావేశం

మణుగూరురూరల్: మండలంలోని గ్రామీణ వైద్యులతో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ నిశాంత్‌రావు మాట్లాడుతూ.. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు వస్తే పీహెచ్‌సీకి తరలించాలని గ్రామీణ వైద్యులకు సూచించారు. స్థాయికి మించి వైద్యం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, ఎస్‌యూఓ లింగ్యానాయక్, వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఆర్‌ఎంపీలు వెంకటేశ్వరరావు, ప్రభుదాస్, పార్వతి పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

చండ్రుగొండ: జిల్లాలోని గిరిజనేతర ఉపాధ్యాయులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రం చండ్రుగొండలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం సంఘం మండల శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలో అధికశాతం ఏజెన్సీ ప్రాంతం ఉండటంతో గిరిజనేతర ఉపాధ్యాయులకు రిజిస్ట్రేషన్, బ్యాంక్‌లోన్ అవకాశాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు యండి.ఆరీఫ్‌హుసేన్, సభ్యులు ఏ.లక్ష్మణ్, ఉండేటి ఆనంద్‌కుమార్, జీఏ జయకర్, రాములు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీలో లోవోల్టేజ్‌తో పాటు కరెంటు కోతలను నివారించాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగా డిమాండ్ చేశారు. ఈ మేరకు సుందరయ్య నగర్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం విద్యుత్ శాఖ ఏఈ రాజారావు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు లక్ష్మణ్‌తో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కలిసికట్టుగా టెండర్లు వేద్దాం

దమ్మపేట: గౌడ సంక్షేమ సంఘం, సభ్యులంతా ఏకతాటిపై ఉండి, మద్యం షాపులకు టెండర్లను కలిసికట్టుగా వేద్దామని గౌడ సంఘం నియోజకవర్గ నాయకుడు, పానుగంటి సత్యం పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మద్యం టెండర్లలో బినామీలకు అవకాశం ఇవ్వకూడదని సభ్యుల చేత తీర్మానం చేయించారు. మద్యం టెండర్లల్లో గౌడ కులస్తులకు ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాళం సూరిబాబు, బొర్రా కేశవులు, ప్రసాద్, వెంకట్, నాగప్రసాద్ పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’తో కన్నీరు తొలిగేనా?

- వరదలకు నేలకూలుతున్న ఇళ్లు
- రూ.3లక్షల సాయానికి ఎదురుచూపులు
- ప్రభుత్వ ప్రకటనతో బాధితుల ఆశలు


వరదలో ఉన్న ఓ నివాసం..


గతేడాది వరదలకు కూలిన ఇల్లు

బూర్గంపాడు: పక్కా ఇళ్ల నిర్మాణాల కోసం పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు. సొంత జాగాలో ఇళ్ల నిర్మాణాలకు రూ.3లక్షల ఆర్థికసాయమందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఏడాది కాలంగా అర్హులైన పేదలు ప్రభుత్వసాయం కోసం వేచిచూస్తున్నారు. ఇంతలోనే గృహలక్ష్మి పథకం అమలుకు తాజాగా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో నిరుపేదల్లో మళ్లీ ఆశలు మొదలయ్యాయి. అయినప్పటికీ అర్హులందరికీ పథకం అందుతుందో లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పథకం అమలవుతుందా లేదా అనే అనుమానాలు పేదలలో వ్యక్తం అవుతున్నాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకాన్ని అమలు చేశారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా ప్రకటించారు. వైఎస్ ఐదున్నరేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమంది ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారు. ప్రభుత్వం కొంతమేరా సాయమందిస్తే, లబ్ధిదారులు కొంత సొంత డబ్బులతో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారు. వైఎస్ మరణానంతరం నాటి ముఖ్యమంత్రులు రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిలు కూడా ఈ పథకాన్ని అమలు చేశారు. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బ్రేక్ వేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయని గృహనిర్మాణ శాఖనే రద్దు చేశారు.

డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో లోపాలు..

ఆ తరువాత ప్రభుత్వ స్థలాల్లోనే ప్రభుత్వమే పూర్తి ఖర్చుతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల వరకు ఖర్చుచేసింది. కాంట్రాక్టర్లుకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను అప్పగించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో పాటుగా రోడ్లు, తాగునీటి వసతులు, విద్యుత్ సౌకర్యం, డ్రెయినేజీలు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఈ పథకం మండలానికి మూడు, నాలుగు గ్రామాల్లోనే అమలైంది. అదికూడా గ్రామానికి ముప్పై నుంచి యాభై ఇళ్ల వరకే నిర్మించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ రసాభాసగా మారింది. చాలాచోట్ల అర్హులైన పేదలకు ఇళ్లు రాలేదు. దీంతో విపక్షాలు పేదలకు ఇళ్ల నిర్మాణాలపై ఆందోళనలు చేపట్టాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో లబ్ధిదారులు ఉండేందుకు కూడా కొన్ని ఇబ్బందికర పరిస్థితులున్నాయి. మేకలు, గొర్రెలు, బర్రెలు, ఎద్దులు ఉన్నటువంటి పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఏమాత్రం అనువుగా లేవు. అదేవిధంగా చేతివృత్తుదారులైన నేతకార్మికులకు, వడ్రంగి తదితర చేతి పనుల వారికి ఈ నిర్మాణాలు అనువుగా లేవు. దీంతో కొంతమంది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి వెళ్లేందుకు ఇష్టపడలేదు. క్షేత్రస్థాయి ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకానికి బదులుగా గృహలక్ష్మి పథకాన్ని ప్రకటించింది.

గృహలక్ష్మితో మార్పు వచ్చేనా..?

అయితే గృహలక్ష్మి పథకం అమలు కోసం ఇన్నాళ్లు ప్రజలు ఎదురుచూశారు. ఒకట్రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే.. ఆ లోపు పథకం అమలు కాకుంటే బ్రేకులు పడతాయని ఆదోళన చెందారు. ఈ లోపే ప్రభుత్వం ప్రకటన చేసింది. ఈ పథకంలో సొంత జాగవున్న పేదలను అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. అదికూడా తొలివిడతలో నియోజకవర్గానికి మూడువేల ఇళ్లు నిర్మాణం చేపట్టేవిధంగా ప్రభుత్వం ప్రకటన చేసింది. దీంతో మండలానికి కేవలం ఐదారు వందల ఇళ్లు మాత్రమే వస్తాయి. గ్రామానికి 30 నుంచి 40 ఇళ్లు మాత్రమే వచ్చే అవకాశాలున్నాయి, ఈ పథకం అమలైన తమకు ఇళ్లు మంజూరవుతాయా లేదా అనే మీమాంసలో పేదలున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీరి ఆశలపై నీరు చల్లకుండా అర్హులపై ప్రతి ఒక్కరూ ఈ పథకంలో లబ్ధిదారులుగా ఉండేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వరదలకు ఇల్లు కూలింది



గతేడాది గోదావరి వరదలకు ఇల్లు కూలింది. అప్పటి నుంచి వరదాలు కట్టుకుని ఉంటున్నాం. ప్రభుత్వ ఇల్లు ఇస్తుందని ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం గృహలక్ష్మి పథకంలో మూడులక్షల రూపాయలు ఇస్తామని చెబుతోంది. దానికోసం చూస్తూ ఉన్నాం.

– దేవంగి రాములు, నాగినేనిప్రోలు

నిలువ నీడ లేదు



గోదారి వరదలకు ఇల్లు కూలిపోయింది. ఏడాది కాలంగా పందిరి వేసుకుని కాలం వెళ్లదీస్తున్నాం. ఈ ఏడాది కూడా వరద ఇంటి ముంగిటికి వచ్చింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇల్లు ఇస్తామని చెబుతున్నారు. గవర్నమెంట్ ఇల్లు ఇస్తే రెండుగదులు కట్టుకుంటాం.

– బత్తుల కమలమ్మ, రెడ్డిపాలెం

సర్వం కోల్పోయినా పట్టించుకోరా..?


కోతకు గురైన రహదారిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

కరకగూడెం: ఇటీవల భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో అనేక మంది నిరుపేదలు వరదలతో సర్వం కోల్పోయినా సీఎం కేసీఆర్ వారిని ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం మండలంలోని పలు వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించి బాధితులకు బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం భారీ వరదలకు కోతకు గురైన బ్రిడ్జిలను, రహదారులను పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొమరం కాంతారావు, సర్పంచ్ తోలెం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కొమరం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ కునుసోద్ సాగర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్వరపీడితులకు మెరుగైన వైద్యసేవలు


జ్వర బాధితురాలిని పరామర్శిస్తున్న జెడ్పీటీసీ శ్రీలత తదితరులు

బూర్గంపాడు: సోంపల్లి గ్రామంలోని జ్వరపీడితులకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. సోమవారం సోంపల్లి ప్రాథమిక పాఠశాలలో జ్వరపీడితుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఆమె సందర్శించారు. అనంతరం పాల్వంచ పీహెచ్‌సీలో చికిత్సలు పొందుతున్న జ్వర బాధితులను పరామర్శించారు. బ్రెడ్లు, ఫ్రూట్స్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆదేశానుసారం వైద్యారోగ్యశాఖ అధికారులు సోంపల్లి గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించటంతో పాటుగా రక్తనమూనాలను సేకరిస్తున్నారన్నారు. గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, బూరం శ్రీనివాస్, తోకల అనిత, గాదె నర్సిరెడ్డి, దనుగూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని అమలు చేయాలి

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ, ఐఆర్‌లను వెంటనే ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పరిషత్ హై స్కూల్ నర్సాపురం శిక్షణ కేంద్రం ఎస్‌ఎన్‌ఎన్ వద్ద టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, యూటీఎఫ్ మండల జిల్లా నాయకులు మాట్లాడారు. పీఆర్సీ, పీఆర్సీ బకాయిలను చెల్లించకుంటే ఈ నెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ముట్టడికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు మండల ప్రధాన కార్యదర్శి బి.రవి, నాయకులు ఎస్.శ్రీను, భద్రు, కాంతారావు టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల రాస్తారోకో

పంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించి, డిమాండ్లను అంగీకరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం యథావిధిగా సమ్మె నిర్వహించి, పలు ప్రాంతాల్లో ర్యాలీలు చేపట్టారు. పలు పార్టీల నాయకులు పాల్గొని వారికి మద్దతు తెలిపారు. మాట్లాడుతూ.. నెల రోజులుగా సమ్మె చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం సమంజసం కాదని విమర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: మండలపల్లిలో రహదారిపై రాస్తారోకో చేస్తున్న పంచాయతీ కార్మికులు


ములకలపల్లి సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు


భద్రాచలంఅర్బన్: సమ్మెను ప్రారంభిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

వాహనాల తనిఖీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పలు వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వాటిని స్టేషన్‌కు తరలించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వాహనదారుడూ విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి నంబర్ ప్లేట్‌తో పాటు సరైన ధ్రువీకరణ పత్రాలు దగ్గరుంచుకోవాలని సూచించారు. విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంకట ట్రాఫిక్ ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

చండ్రుగొండ: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సాదియాసుల్తానాను పాస్టర్స్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. పదవీకాలంలో ప్రజలకు మేలు జరగాలని ఆకాంక్షించారు. పాస్టర్లు యోసురత్నం, ఆంథోని, లాజరస్, ఏలియా, కుమార్ పాల్గొన్నారు.

బదిలీ సీఐకి..

అశ్వాపురం: అశ్వాపురం సీఐగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్లిన శ్రీనివాసరావును సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్, ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి విచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా సీఐ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భారజల కర్మాగారం ఉద్యోగి జీఎస్.రావు, నర్సయ్య పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దుమ్ముగూడెం: ఆగస్ట్ 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని టీఏజీఎస్ రాష్ట్ర నాయకుడు కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని జెడ్ వీరభద్రపురం గ్రామంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం గ్రామ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, కోర్స చిలకమ్మ, కొమరం చంటి, కొండబాబు, కారం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వులు అమలు చేయాలి

అశ్వారావుపేట: వాగొడ్డుగూడెం గ్రామ గిరిజనులకు సర్వే చేసి భూమిని అప్పగించాలనే కోర్టు ఉత్తర్వులను అధికారులు అమలు చేయాలని ఆదివాసీ నాయకుడు ఊకే రవి డిమాండ్ చేశారు. సోమవారం వాగొడ్డుగూడెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారులు సర్వే చేయకుండా అన్యాయం చేస్తున్నారని అన్నారు.

జెడ్పీటీసీ పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు నాయకుడు యక్కటి సీతారాంరెడ్డి తండ్రి సత్యనారాయణరెడ్డి(106) మృతదేహానికి సోమవారం జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారాంరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, పార్టీ పాల్గొన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో


అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సున్నం నాగమణి

ములకలపల్లి: తమ గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని కోరుతూ స్థానికులు రోడ్డెక్కారు. ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సీతారాంపురం జీపీ పరిధిలోని పాతూరు, మేడివాయి, ఎర్రొడ్డు గ్రామాలకు గత వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆగ్రహం చెందిన స్థానికులు పాల్వంచ-మండలపల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి సంఘీభావం ప్రకటించి, రోడ్డుపై బైఠాయించారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఎంపీడీఓ శ్రీను, స్థానిక సర్పంచ్ సున్నం సుశీల, జీపీ కార్యదర్శి విక్రమ్ ఘటనా ప్రదేశానికి చేరుకుని మాట్లాడారు. యుద్ధప్రాతిపదికన నీటి సరఫరా పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అంజుం, బూరుగుపల్లి పద్మశ్రీ, ఊకే అశోక్, కుంజా బుల్లెమ్మ, కుంజా రవి, సున్నం సోములు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శేషగిరిరావు

మణుగూరురూరల్: సీజనల్ వ్యాధుల విషయంలో సింగరేణియులు, వారి కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సింగరేణి ఏరియా ఆస్పత్రి వైద్యుడు శేషగిరిరావు సూచించారు. సోమవారం మణుగూరు ఓసీ గని ప్రాంగణంలో కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు వల్ల నీరు కలుషితమవడం వల్ల సీజనల్ వ్యాధులు వస్తాయని, అవి వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల్లోని కుండీలు, టైర్లు మొదలగువాటిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని, ఆహారం భుజించే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోలని తెలిపారు. కార్యక్రమంలో మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసచారి, గని అధికారులు, సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

అశ్వారావుపేట: మండల పరిధిలోని గాండ్రాల, దురదపాడు గ్రామాల్లో సోమవారం తెల్లపశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేసి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దురదపాడు సర్పంచ్ కుంజా సరోజిని, పశువైద్య సిబ్బంది డాక్టర్ ఎం స్వప్న, హుస్సేన్, మదార్‌భక్ష్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పరిధిలోని లింగాలపల్లి గ్రామం పశువైద్యశాలలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని సోమవారం ఎంపీపీ సోయం ప్రసాద్ ప్రారంభించారు. మూడు వైద్య బృదాల ద్వారా మండల పరిధిలోని 25 వేల పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుశీల, కాసాని ప్రసాద్, పశు వైద్య సిబ్బంది నారాయణరావు, రవి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రంకు పెట్టెల వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కారుణ్య చైల్డ్ కేర్ సెంటర్ బాలల ఆశ్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో డిస్ట్రిక్ చైర్ పర్సన్ లయన్ జీఎస్ శంకర్‌రావు సహకారంతో విద్యార్థులకు 20 ట్రంకు పెట్టెలను సోమవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. విద్యా, వైద్య రంగంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు లయన్స్ క్లబ్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, తిప్పన సిద్ధులు, గుండు శరత్, భరత్‌కుమార్, సునీల్, రమేష్, రంగారెడ్డి, రామలింగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళులు


భద్రాచలంఅర్బన్: గద్దర్ మృతికి సంతాపం తెలుపుతున్న న్యాయవాదులు


భద్రాచలంటౌన్: గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

భద్రాచలంఅర్బన్: ప్రజా గాయకులు గద్దర్ మృతికి సంతాపాన్ని వ్యక్తం చేస్తూ భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అసోసియేషన్ హాల్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు కోట దేవదానం నేతృత్వంలో సంతాపం తెలిపారు. మరోవైపు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలోనూ గద్దర్‌కు నివాళులు అర్పించారు.

మణుగూరురూరల్: మణుగూరులోని అమరవీరుల స్మారకస్తూపం వద్ద విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం గద్దర్‌కు కొవ్వొత్తులతో ఘన నివాళ్లు అర్పించారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని వివరించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట అమరవీరుల స్మారకస్తూపాన్ని గద్దర్ ఆవిష్కరించిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ కన్వీనర్ దుర్గ్యాల సుధాకర్, జంపాల శ్రీనివాస్, ఎర్రోళ్ల అనిల్, గాజుల నరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం యువజన సంఘం ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చల్లా రమేష్, ఇనుపనూరి రాంబాబు, పుల్లయ్య, రుంజా శ్రీను, వెంకటేశ్వర్లు, జమలయ్య, లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, లాలు, మధు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఏఎంసీ కాలనీలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గద్దర్ యాదిసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను గద్దర్ తన పాటలతో ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో చల్లగుళ్ల నాగేశ్వరరావు, డాక్టర్ భానుప్రసాద్, అలవాల రాజా పెరియార్, రమణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సతీష్, లత, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: విప్లవ రచయిత గద్దర్‌కు ఎన్డీ మండలశాఖ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. మండలకేంద్రం చండ్రుగొండలో సోమవారం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన మరణం తీరనిలోటని ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎస్‌కె.ఉమర్ అన్నారు. పార్టీ నాయకులు వరికూటి వెంకట్రావ్, వెంకటేశ్వర్లు, రాముడు పాల్గొన్నారు.


బూర్గంపాడు: గద్దర్ మృతికి కాంగ్రెస్, ఎన్డీ పార్టీలు వేర్వేరుగా నివాళులర్పించాయి. బూర్గంపాడులో జరిగిన కార్యక్రమాలలో గద్దర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ, బర్ల నాగమణి, మందా నాగరాజు, డి.పున్నంచంద్ పాల్గొన్నారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధకత

తల్లిపాల వారోత్సవాలను గ్రామాలు, పట్టణాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్, ఆరోగ్యశాఖల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, తల్లులకు తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. ముఖ్యంగా ముర్రుపాలు పట్టించడం పిల్లల ఆరోగ్య ఎదుగుదలకు అవసరమని వివరించారు. మరోవైపు గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


భద్రాచలంఅర్బన్: గర్భిణులుకు అవగాహన కల్పిస్తున్న ఏరియా ఆస్పత్రి వైద్యులు


అశ్వారావుపేట: గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సర్పంచ్ రమ్య తదితరులు


దుమ్ముగూడెం: సీమంతం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్